ఆ స్కూల్ బస్సులు అన్‌ఫిట్

గ్రేటర్‌లో మొత్తం 11,854 బస్సులు

4,500 బస్సులు ఫిట్‌నెస్‌కు పరీక్షలు పూర్తి

అందులో 20 శాతం బస్సులు అన్‌ఫిట్

కొనసాగుతున్న స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల డ్రైవ్

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ) : మరి కొన్ని రోజుల్లో పాఠశాలలు ప్రారంభం అవుతుండటంతో రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక టీంలు తనిఖీలు చేపట్టాయి. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రవాణా శాఖ పరిధిలో 11,854 విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 4,500 విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష పూర్తయింది. ఇందులో 20శాతం బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అధికారులు అన్‌ఫిట్‌గా తేల్చేశారు. విద్యాసంస్థల బస్సులు నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచనలు చేశారు.

గ్రేటర్‌లో విద్యాసంస్థల బస్సులు

హైదరాబాద్	-2,234
రంగారెడ్డి	-5,500
మేడ్చల్	-4,120

ఇవి పాటించాల్సిందే..!!

- మోటార్ వాహనాల చట్టం ప్రకారం స్కూల్ బస్సు తప్పక పాటించాల్సిన నియమాలు కొన్ని ఉన్నాయి. 1.రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ), 2.వ్యాలీడ్ ఇన్స్యూరెన్స్ సర్టిఫికెట్, 3.వ్యాలీడ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 4.పర్మిట్, 5.ట్యాక్స్ పేమెంట్ రశీదు(బకాయిలు లేకుండా), 6.పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, 7.డ్రైవింగ్ చేసే డ్రైవర్ లైసెన్సు తప్పక వాహనంతో ఉండాలి.
- ప్రభుత్వ సూచనల మేరకు ఐదు రకాల వాహనాల వేగానికి కళ్లెం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో విద్యాసంస్థల బస్సులు కూడా ఉన్నాయి. ఫిట్‌నెస్‌కు ముందే ఆయా వాహనాల్లో వేగ నియంత్రణ పరికరాలు ఉండేలా చూడాల్సి ఉంటుంది.
- తెలంగాణ మోటార్ వెహికల్ రూల్స్ 1989 ప్రకారం రూల్ నంబర్ 186జీ ప్రకారం తెలంగాణలో విద్యాసంస్థల బస్సులు పూర్తి పసుపు రంగులో ఉండాలి. ఆ బస్సుపై పెద్ద అక్షరాలతో స్కూల్ బస్సు అని రాయడం తప్పనిసరి.
- వాహనం డ్రైవర్ 60 సంవత్సరాలకు మించి ఉండరాదు. డ్రైవర్‌కు సంబంధించిన ఆరోగ్య వివరాలు బస్సులో అతికించాలి.
- కనీసం ఐదు సంవత్సరాలు డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
- వాహనంలో ఫిర్యాదుల పట్టికను ఏర్పాటు చేసి ఫిర్యాదులను ప్రతి నెలకు ఒకసారి పరిశీలించాలి.
- ప్రతి వాహనంలో అత్యవసర ద్వారం పెట్టాలి. పెద్ద అక్షరాలతో రాయించాలి. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
- ప్రతి బస్సులో విద్యార్థుల పేర్లు, ఇంటి చిరునామా, తరగతులు, దిగాల్సిన ప్రదేశం పేర్ల పట్టికతో పాటు రూట్ మ్యాప్ తప్పని సరి ఉండాలి.
- విద్యార్థులు బస్సును ఎక్కడం, దిగడం విషయాన్ని గ్రహించేందుకు కన్వెక్స్ క్రాస్ అద్దాలుండాలి. ప్రతి బస్సులో కూర్చున్న విద్యార్థులు డ్రైవర్‌కు కన్పించేలా పెద్ద అద్దం పెట్టాలి.
- బస్సులు సీట్ల కింద విద్యార్థుల బ్యాగులు పెట్టుకునేందుకు అరలు ఏర్పాటు చేయాలి.
- రవాణా శాఖ ఇచ్చే శిక్షణలో డ్రైవర్ పాల్గొనాల్సి ఉంటుంది. సంవత్సరానికి ఒకసారి విద్యార్థులచే రోడ్ సేఫ్టీ డేను నిర్వహించాలి.

ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుంది

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాం. స్కూల్ బస్సుల వివరాలను ఆర్టీఏ కార్యాలయాల్లో అందజేయాలి. విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండాల్సిందే. నిబంధనలు పాటించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. ఫిట్‌నెస్ లేకున్నా.. అర్హత లేని డ్రైవర్లను నియమించుకున్నా కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా సాంకేతికంగా చాలా జాగ్రత్తగా ఉండాలి. యాంత్రికంగా చూస్తే ఇంజిన్, గేర్ బాక్సు, క్లచ్, స్టీరింగ్ పనితీరు సక్రమంగా ఉందో..? లేదో..? పరిశీలించుకోవాలి. వాటిలో ఎలాంటి లోపాలు ఉండకూడదు. ఎలక్ట్రికల్ విషయాల్లో బ్యాటరీ, వైపర్స్, రెండు వైపుల ఇండికేటర్లు పకడ్బందీగా పనిచేయాలి. యాజమాన్యాలు డ్రైవర్ వివరాలు పేరేంట్స్‌కు తెలిసేలా ఉంచాలి. ఫిట్‌నెస్ చేయని వాహనాలు రోడ్డెక్కితే సీజ్ చేస్తాం.

-సి.రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, హైదరాబాద్

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోండి

హిమాయత్‌నగర్, మే 24: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న యాదాద్రి జిల్లాకు చెందిన ఇద్దరు విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం శుక్రవారం పాఠశాల కమిషనర్ దేవసేనకు వినతిప్రతం అందజేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కొంత కాలంగా యాదాద్రి జిల్లా డీఈవో నారాయణరెడ్డి, చౌటుప్పల్ ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి విధులకు డుమ్మా కొడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో పాటు కొంతమంది ఉపాధ్యాయుల నుంచి ప్రతినెలా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వారి ఆగడాలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కమిషనర్ విచారణ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షపతిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, నాయకుడు గౌని రాజేశ్ పాల్గొన్నారు.

ఎంపీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 24: ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

'లా'లో బ్యాక్‌లాగ్ ఉన్నవారికి వన్‌టైమ్ చాన్స్

ఓయూ పరిధిలోని లా కోర్సు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు అధికారులు తెలిపారు. 2వేల సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును వచ్చే నెల 20లోపు, రూ.500 అపరాధ రుసుముతో కలిపి 27 తేదీలోపు చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలు జూలై, ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు.

హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ,మే 24: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ శిక్షణ, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతి, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇన్ఫర్మేషన్ రంగం, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలిస్ట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వన్నుట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువకులు జూన్ 6 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 95058 00050 ను సంప్రదించాలని సూచించారు.

జూన్ 3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): జూన్ 3 నుంచి 13 వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో 35 పరీక్ష కేంద్రాల్లో 12,186 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

వెంకటరమణ మరణవార్త తీవ్రంగా కలిచివేసింది

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిటీబ్యూరో , మే 24, (నమస్తే తెలంగాణ) : మూసీ నది అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.వెంకటరమణ మరణ వార్త ఎంతగానో కలిచివేసిందని, ఆయన లేరన్న విషయంతో షాక్‌కు గురయ్యానని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం ట్విట్టర్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. అంకితభావంతో, కష్టపడి పనిచేసే ఇంజినీర్‌ను కోల్పోయామని చెప్పారు. దుర్గం చెరువు, వెస్ట్ కారిడార్‌లోని ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల విజయవంతంలో ఆయన పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. వెంకటరమణ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌కు రూ.5 లక్షల విరాళం

మాదాపూర్, మే 24 : ప్రముఖ వాణిజ్య సంస్థ జన చైతన్య హౌసింగ్ అధినేత మాదాల సుధాకర్ శుక్రవారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు రూ.5 లక్షల భూరి విరాళంను సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నారాయణ చేతుల మీదుగా అందజేశారు. చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సీఆర్ పాలిక్లినిక్, డయాగ్నొస్టిక్స్ సెంటర్ల నిర్వహణకు ఈ విరాళాన్ని అందించాలని కోరారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రభాకర్, కార్యదర్శి ఆర్ వెంకటగోపాల్

సుల్తాన్‌బజార్, మే 24: మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రభాకర్ టీఎన్జీవో కేంద్ర సంఘాన్ని కోరారు. శుక్రవారం నాంపల్లిలోని టీఎన్జీవో కేంద్ర సంఘం భవనంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు ఆయన ఫోరం సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న మేనేజర్లు, రెవెన్యూ అధికారుల్లో ఉన్న 1,2,3 క్యాటగిరీలను తొలగించి, మిగతా శాఖల్లో ఉన్న తరహాలో సూపరింటెండెంట్‌గా పేరు మార్పుతో పాటు వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సెంట్రల్ ఫోరం కార్యదర్శి ఆర్ వెంకటగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పేరుతో ప్రకటనలు ముద్రించిన ఔషధాలు సీజ్

సంబంధిత ఫార్మా కంపెనీలకు నోటీసులు జారీచేసిన డీసీఏ అధికారులు

మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై చికిత్స పేరుతో ప్రకటనలు ముద్రించి ఉన్న పలు రకాల ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సీజ్ చేశారు. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్ రెడ్డి కథనం ప్రకారం.. 'ఆర్థో విన్ గోల్డ్ ఆయిల్' అనే ఆయుర్వేదిక్ తైలంపై 'న్యుమోనియా'ను నివారిస్తుందని, ఆమ్లా జ్యూస్ అనే ఆయుర్వేదిక్ ఔషధంపై డయాబెటిక్ చికిత్స కోసం అని ముద్రించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు రంగారెడ్డి జిల్లా గండిపేటలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ముద్రించిన 'ఆర్థో విన్ గోల్డ్ ఆయిల్'ను, నిజామాబాద్‌లోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి ఆమ్లా జ్యూస్ ఔషధాలను సీజ్ చేశారు. అనంతరం సంబంధిత తయారీ ఫార్మా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు.

సాంకేతికతతోనే కొత్త ఔషధాల ఆవిష్కరణను అనుమతించవచ్చు

దీపక్ సుప్రా

మాట్లాడుతున్న డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ సీఈఓ దీపక్ సుప్రా

మాదాపూర్, మే 24: సాంకేతికత ఆధారంగా వేగంగా, సమర్థవంతంగా, తక్కువ ధరకు కొత్త ఔషధాల ఆవిష్కరణను అనుమతించవచ్చని డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ సీఈఓ దీపక్ సుప్రా అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన డీఎక్స్ఎం 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ సీఈఓ దీపక్ సుప్రా, సీఐఎం డేటా సీఈఓ, అధ్యక్షుడు పీటర్ బిలెల్లో హాజరై మాట్లాడారు. మెషిన్ లెర్నింగ్ వంటి అనేక నూతన తరంగాల సాంకేతికతలతో, ఔషధ, మాలిక్యూలర్ డేటా రెండింటిలోను విస్తృతమైన డేటాను స్వయం చాలకంగా సంక్లిష్ట నమూనాలను రూపొందించడానికి ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ తరహా ప్రక్రియ ఆవిష్కరణను మరింత సులభతరం చేయనుండటంతో పాటు శరీరంలో మందులు ఏ విధంగా పనిచేస్తాయో అంచనా వేయడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఔషధాల ఆవిష్కరణ చాలా క్లిష్టమైన వ్యవహారమని, దీనికి 10 నుంచి 15 సంవత్సరాల సమయం పడుతుందన్నారు. ఈ ప్రక్రియ చాలా ఖర్చుతో కూడుకున్నదన్నారు. యూఎస్ 2 బిలియన్, 16 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. మన ఆరోగ్య సంరక్షణ మొబైల్ ఫోన్‌లో ఉండటం, అతిపెద్ద డయాగ్నస్టిక్ పరికరం మన మొబైల్ అని పేర్కొన్నారు. బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్న రోగులకు రోగ నిర్ధారణ, చికిత్స ఎంపికలో వైద్యులకు సహాయం చేయడానికి రూపొందించబడిందని చెప్పారు. వ్యాధులను నిర్ధారించడంలో వైద్యులకు సహాయం చేయడానికి ఉపయోగించబడుతుందన్నారు. ఇద్దరు రోగుల డేటాపై పనిచేసే విప్లవాత్మక ఉత్పత్తులు యూజర్ ఫ్రెండ్లీ కానందున విఫలమైనట్లు తెలిపారు. పాశ్చాత్య దేశాల్లోనే కాకుండా భారతదేశంలో వ్యక్తీకరించిన మందులపై పరిశోధన జరుగుతున్నట్లు వివరించారు. క్లినికల్ ట్రయల్స్ ఉపయోగించే జంతువుల అనుకరణ మోడల్ ద్వారా భర్తీ చేయవచ్చన్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. తయారీలో డిజిటలైజేషన్‌ను స్వీకరించడం వల్ల 2025 నాటికి భారతదేశ జీడీపీకి 1.04 ట్రిలియన్ డాలర్లు జోడించవచ్చని పేర్కొన్నారు. ఇది ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని సూచిస్తుందన్నారు. దక్షిణ కొరియా తన లాభాల్లో 5.2 శాతం ఆర్‌అండ్ డీ కోసం ఖర్చు చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా భారతదేశం కేవలం 0.8 శాతం ఖర్చు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, యువ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను కలిసి సమస్యలను విన్నవిస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్

సుల్తాన్‌బజార్, మే 24 : రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, కార్యదర్శి విక్రమ్ కుమార్‌తో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. 2021లో పౌర సరఫరాల శాఖలో పని చేసిన కొందరు అధికారులు అధికారిక లాగిన్ ద్వారా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై ఫిర్యాదు చేసి మూడేండ్లు గడుస్తున్నా ఎటువంటి విచారణ చేపట్టలేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులను పై స్థాయి అధికారులు కాపాడుతూ వస్తున్నారని ఆయన కమిషనర్‌కు వివరించారు. స్పందించిన కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రధాన రేషనింగ్ అధికారికి ఫోన్ చేసి సమస్యను వివరించి త్వరగా నివేదిక సమర్పించాలన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై నివేదిక అందిన వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

ఇంటర్ పరీక్షాకేంద్రాల వద్ద 144సెక్షన్

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధిస్తూ పోలీసు కమిషనర్లు ఆదేశాలు జారీచేశారు. ఇంటర్ పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల దూరం వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని, ఈ ప్రాంతాల్లో ఐదు లేదా అంతకు మించి జనాలు గుమిగూడటం, రాస్తారోకో, ధర్నాలు వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టడం నిషేధమని పోలీసు అధికారులు ఆదేశించారు. ఈనెల 24 నుంచి జూన్ 3వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు.

యూఎస్‌లో జోయాలుక్కాస్ షోరూమ్ ప్రారంభం

జూబ్లీహిల్స్, మే 24 : యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో జోయాలుక్కాస్ సందడి చేయనున్నది. శుక్రవారం టెక్సాస్‌లోని హూస్టన్‌లో అంతర్జాతీయ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ ఔటెలెట్‌ను ప్రారంభించారు. ఫోర్ట్ బెండ్ కౌంటీ జడ్జి కేపీ.జార్జ్, కౌంటీ కోర్టు లా ప్రిసైడింగ్ జడ్జి జూలీ మాథ్యూ ముఖ్య అతిథులుగా హాజరై జోయాలుక్కాస్ గ్రూప్ సీఎండీ జాయ్ అలుక్కాస్ కలిసి ఉత్తేజభరితమైన ఆఫర్స్‌తో ఈ షోరూమ్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రూప్ సీఎండీ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ కొత్తగా నవీకరించబడిన షోరూమ్‌ను ప్రారంభించడం సంతోషమని.. ఆఫర్స్‌లో భాగంగా రూ.1,000 యూఎస్ డాలర్స్ విలువైన గోల్డ్ జ్యువెలరీ కొనుగోలు చేసిన వినియోగదారులకు 0.2 గ్రామ్ గోల్డ్ కాయిన్, యూఎస్ డాలర్స్ రూ.2 వేలు విలువగల డైమండ్, పోల్కి, ముత్యాల జ్యువెలరీ కొనుగోలు చేసిన వారికి 1 గ్రామ్ గోల్డ్ కాయిన్ ఉచితంగా పొందే అర్హత లభిస్తుందని తెలిపారు.

జర్నలిస్టులు విధినిర్వహణలో నిష్పక్షపాతంగా ఉండాలి

విశ్రాంత ఐపీఎస్ అధికారి ఐ.వై.ఆర్ కృష్ణారావు

విశిష్ట పురస్కారాలు అందుకున్న జర్నలిస్టులతో ప్రముఖులు

తెలుగు యూనివర్సిటీ, మే 24 : జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ వృత్తిధర్మాన్ని నిర్వర్తించాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అన్నారు. సమాచార భారతి ఆధ్వర్యంలో రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సీలో నారద జయంతిని పురస్కరించుకొని ప్రపంచ పాత్రికేయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ.. దేశాన్ని విచ్ఛిన్నకర శక్తులనుంచి కాపాడుకునేందుకు జాతీయవాదులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం పలు వ్యవస్థలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజంలో విలువలు, పోకడలు కనుమరుగవుతున్నాయని, ఫేక్ న్యూస్ సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్నదన్నారు. నారదుడు ఉండి ఉంటే ప్రస్తుత మీడియా వ్యవహారశైలిలో మనుగడ సాగించలేక పోయి ఉండేవాడని ఆయన చమత్కరించారు. సభాధ్యక్షుడు సమాచారభారతి అధ్యక్షుడు డాక్టర్ జి. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయవాద శక్తులను బలోపేతం చేసేందుకు సమాచార భారతి కృషి చేస్తున్నదన్నారు. యువ జర్నలిస్టులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నారద జయంతి సందర్భంగా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ కట్టా రాజగోపాల్, భాగ్యనగర్ విభాగ్ ప్రచార ప్రముఖ్ సత్తిరాజు, పాత్రికేయురాలు నవత పాల్గొన్నారు. విశిష్ట పురస్కారాలను పత్రికా రంగ ప్రముఖులు యాబలూరి సీతారామశర్మ, గుళ్లపూడి శ్రీనివాసకుమార్, డాక్టర్ చిరువోలు పార్థసారథి, కందికట్టు దుర్గానరసింహారావు, పొన్నపల్లి నాగవాణి, గంగం మహేశ్‌రెడ్డి అందుకున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మే 24(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో శుక్రవారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానల్లో మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. వందశాతం గర్భిణులు ప్రభుత్వ దవాఖానలకు సాధారణ ప్రసవాలకు వచ్చేలా వైద్య అధికారులు ప్రోత్సహించాలని, పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్‌డీసీ ఇమ్యునైజేషన్, మాతా ఆరోగ్య సేవలు మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బర్త్ ప్లానింగ్, కాన్పుల సంఖ్య, ఎన్‌సీడీ టెలికన్సల్టేషన్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, వైద్యాధికారి రఘునాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

వీఐటీలో నైతిక విలువలతో కూడిన విద్య

జూబ్లీహిల్స్, మే 24: నైతిక విలువలకు కట్టుబడి నైపుణ్యతతో కూడిన విద్యనందించడంలో వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ–ఏపీ) కృషి అభినందనీయమని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సి.టి. రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వీఐటీ–ఏపీ 7వ విశ్వవిద్యాలయ దినోత్సవానికి పూర్వ విద్యార్థి అయిన జస్టిస్ సి.టి. రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ బెంగళూరు డైరెక్టర్ అమిత్ చౌదరి, వీఐటీ వ్యవస్థాపకులు.. ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తదితరులు పాల్గొన్నార